సాక్షి నంద్యాల

సోమవారం ‌। 4 ‌। ఆగస్టు ‌। 2025



నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై ఆదివారం విశాఖపట్నంకు చెందిన వేదగాయత్రి నత్య కళాక్షేత్రం వారి కూచిపూడి నత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



రిపేరు చేస్తానంటూ చోరీలు

మిక్సీలు, గ్యాస్ స్టౌలు రిపేరు చేస్తామని సైకిల్‌పై గ్రామాల్లో తిరుగుతూ తాళం వేసిన ఉంచిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 43,736
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 23,399

న్యూస్‌రీల్

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూ లైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూ లైన్లు నిండి పోయాయి. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. భక్తుల శివ నామ స్మరణతో శ్రీశైల ఆలయం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

ఉద్యోగుల సమస్యలపై 'మాట్లాడుకుందాం రండి'



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రప్ప

నంద్యాల(న్యూటౌన్): సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5న నంద్యాల జిల్లాలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప పేర్కొన్నారు.ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలతో పాటు ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై ఉద్యోగులతో టీ తాగుతూ చర్చించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.35 వేల కోట్లకు సంబంధించిన బకాయిలు దాదాపు 27 రకాల సమస్యలను మాట్లాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సంఘం ఆదేశాలకు అనుగుణంగా చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాలూకా ఏడీఏ విజయశేఖర్, జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు సునిల్‌కుమార్, విజయలక్ష్మి, నంద్యాల అధ్యక్షుడు సత్యం, వెంకటశివన్న, చక్రధర్ పాల్గొన్నారు.


నేడు ఆత్మకూరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో తనతో పాటు జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. జిల్లా అధికారులందరూ ఉదయం 11.00 గంటలకు ఈ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలన్నారు. అలాగే కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుంచి యథావిధిగా విజ్ఞప్తులు స్వీకరిస్తారని చెప్పారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా meekosam. ap. gov. in లో ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్‌లైన్‌లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

- ఇష్టానుసారంగా ఆర్‌ఎంపీల వైద్యం
- ఇటీవల నందికొట్కూరులో మహిళకు అబార్షన్
- గత నెలలో కల్లూరులో ఓ మహిళకు వికటించిన వైద్యం
- తరచూ జిల్లాలో ఎక్కడో చోట ఇలాంటి ఉదంతాలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ

జలుబు చేస్తే.. జ్వరం వస్తే.. విపరీతమైన నొప్పులు బాధిస్తుంటే... స్థానికంగా డాక్టర్లు ఉండరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే వైద్య పరీక్షలు చేసే వారు కనిపించరు.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని చాలా మంది ఆర్‌ఎంపీల వద్దకు వెళ్తున్నారు. అక్కడ ప్రథమ చికిత్స చేయకుండా ఆపరేషన్లు చేస్తూ ప్రాణాలు తీస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను బలోపేతం చేయడం లేదు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పక్కన పెట్టేసింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఊరూరా అర్హత లేని వైద్యం ప్రజలకు దిక్కయ్యింది. రోగుల ప్రాణాలు దైవాధీనం అయ్యాయి.



అర్హత లేని వైద్యం
ప్రాణాలు దైవాధీనం

కర్నూలు(హాస్పిటల్): ఆర్‌ఎంపీలు చేస్తున్న వైద్యానికి అమాయకులైన పేదల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. వెళ్లిన వెంటనే పనైపోతుందని, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో వారు ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. అర్ధరాత్రి అయినా వీరు అందుబాటులో ఉండటం, ఏ రోగమైనా రెండు ఇంజెక్షన్లు వేస్తే తగ్గిపోతుందని ప్రజల్లో నమ్మకం బలంగా ఏర్పడటంతో ప్రజలు ఆర్‌ఎంపీలను నమ్ముకుంటున్నారు. అధిక శాతం అప్పటికప్పుడు వ్యాధి నయం అవుతున్నా...కొందరికి భవిష్యత్తులో, మరికొందరికి కొన్ని రోజుల తర్వాత రియాక్షన్ వస్తోంది. ఇలాంటి వారు చివరి దశలో నిపుణులైన వైద్యుల వద్దకు చికిత్స చేయించుకుంటున్నారు. నకిలీ వైద్యుల చికిత్సతో సైడ్‌ఎఫెక్ట్ వచ్చి మెరుగైన వైద్యం కోసం వచ్చే వారి సంఖ్య కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోజురోజుకూ పెరుగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు వేల మందికి పైగా ఆర్‌ఎంపీలు రోగులకు చికిత్స అందిస్తున్నారు. వీరి నిర్వహించే క్లినిక్‌లకు ఎలాంటి అనుమతులు ఉండవు. అవసరమైన మందులు, వైద్యపరీక్షల పరికరాలు, స్కానింగ్ మిషన్లు వీరి వద్ద ఉన్నా కూడా ఎవ్వరూ అడగరు. ఇలాంటి అనుమతి లేని ఆసుపత్రుల కారణంగా ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

నాడు మారుమూల పల్లెకూ వైద్యం

ప్రజలకు నిపుణులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉండేందుకు గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా ప్రథమ చికిత్స కోసం వీటిని సంప్రదించేలా చర్యలు తీసుకుంది. అక్కడ ప్రాథమిక వైద్యపరీక్షలతో పాటు బీఎస్సీ నర్సింగ్ చదివిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో 450లకు పైగా విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. వీరి స్థాయికి మించిన వ్యాధి వస్తే ముందుగా పీహెచ్‌సీల్లోని వైద్యాధికారిని సంప్రదిస్తారు. వారికీ అర్థం గాకపోతే టెలిమెడిసిన్ ద్వారా కర్నూలు జీజీహెచ్, నంద్యాల జీజీహెచ్‌లలోని టెలిమెడిసిన్ వైద్యులకు వీడియో కాల్ ద్వారా కలిసి రోగికి ఉన్నచోటే అవసరమైన వైద్యాన్ని అందించేలా ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా రోగి వద్దకే వైద్యులు వచ్చి చికిత్స అందించేవారు. ఆరోగ్య రక్ష కార్యక్రమం ద్వారా ఊళ్లోనే వైద్యశిబిరాలు ఏర్పా టు చేసి చికిత్స అందించేవారు. అలాగే పట్టణాల్లో మురికివాడల్లో సైతం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింతగా పెంచి అక్కడ ఎంబీబీఎస్ చదివి న వైద్యులను నియమించారు. బేసిక్ వ్యాధులన్నింటికీ అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. అవసరమైన ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులు సైతం ఇక్కడ ఉన్నారు. మురికివాడల్లోని పేదలు ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లకుండా ఇక్కడే వారికి ప్రాథమిక స్థాయి వైద్యం అందుబాటులోకి తెచ్చారు.

మృతులు వీరే..

➡ గడివేముల మండలం గని గ్రామానికి చెందిన శివమ్మ కుమార్తె శ్రీవాణి గత నెల 28న నందికొట్కూరు పట్టణంలోని గీతారాణి అనే మహిళకు ఆర్‌ఎంపి వద్ద అబార్షన్ చేయించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో 30వ తేదీన ఆమె మృతి చెందారు. ఆమెకు కర్నూలులోని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న ఓ హాస్పిటల్‌లో లింగనిర్ధారణ చేసినట్లు సమాచారం. శనివారం వరకు ఆ స్కానింగ్ సెంటర్‌ను అధికారులు తనిఖీ చేయని పరిస్థితి నెలకొంది.



శ్రీవాణి (ఫైల్)

➡ కర్నూలు నగరంలోని కల్లూరు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు జ్వరం రావడంతో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ ఇంజెక్షన్లు ఇచ్చారు. అవి వికటించి ఆమె మృతి చెందారు.

➡ కొత్తాళానికి చెందిన రాణమ్మకు కీళ్లనొప్పి ఉండటంతో స్థానికంగా ఉన్న ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆమెకు వరుసగా మూడు రోజుల పాటు ఇంజెక్షన్లు ఇవ్వడంతో వికటించి మృతిచెందారు.

➡ పత్తికొండ పట్టణానికి చెందిన వై.రంగస్వామి(35) ఛాతీలో మంటగా ఉండటంతో గత నెల 30న స్థానికంగా ఉన్న ఒక క్లినిక్‌కు వెళ్లగా అసిస్టెంట్ వైద్యం చేశాడు. ఇంటికి వెళ్లిన వెంటనే రంగస్వామి ప్రాణాలు కోల్పోయాడు.

➡ గత ఏడాది గోనెగండ్ల మండలం గంజిహల్లి గ్రామంలో రాజేష్(12) జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీని సంప్రదించారు. అతను బాలునికి ఇంజెక్షన్ వేయడంతో అక్కడ గడ్డ ఏర్పడింది. దాని నుంచి చీము, రక్తం కారడంతో ఆసుపత్రిలో చేరగా కోలుకోలేక మృతి చెందాడు.

విచ్చలవిడిగా ఆర్‌ఎంపీల వైద్యం

గ్రామాల్లో సాయంత్రం దాటితే విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కమ్యూనిటీ ఆఫీసర్లు, యుపీహెచ్‌సీల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండటం లేదు. ప్రజలు ఉదయం పనులకు వెళ్లిన సాయంత్రం మాత్రమే ఇళ్లకు చేరుకుంటారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వైద్యం చేయడానికి వీరికి ఎలాంటి అర్హత లేకపోయినా రోగులకు చికిత్స చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కర్నూలులోని పలు ప్రాంతాల్లో కొందరు ఆర్‌ఎంపీలు ఇష్టానుసారం వైద్యం చేస్తున్నారు. గూడూరు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, కౌతాళం, హాలహర్వి, ఆలూరు మండలాల్లో 5వేల మందికి పైగా ఆర్‌ఎంపీలు ఉన్నారు.

అల్లోపతి వైద్యుల ఖర్చుకు భయపడి!

వైద్యం ప్రస్తుత పరిస్థితుల్లో భారంగా మారింది. పట్టణాల్లోని వైద్యుల వద్దకు జ్వరం వచ్చిందని వెళ్లినా రూ.3వేల నుంచి రూ.5వేల దాకా ఖర్చు వస్తోంది. పెద్దరోగమైతే ఆస్తులు అమ్ముకోవాల్సిందే. అందుకే ఏ చిన్నరోగమొచ్చినా మందుగా ఆర్‌ఎంపీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్‌ఎంపీలు తెలిసీ తెలియని వైద్యంతో వారికి చికిత్స చేసి ప్రాణాల మీదుకు తీసుకొస్తున్నారు. కొందరు సెలైన్‌లు(ఫ్లూయిడ్స్) ఎక్కించడంతో పాటు ప్రసవాలు, అబార్షన్లు, స్కానింగ్, మైనర్ సర్జరీలు నిర్వహిస్తున్నారు. కర్నూలు, కోడుమూరు, గూడూరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు వంటి ప్రాంతాల్లో ఆసుపత్రులు కూడా తెరిచి ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. కనీసం ఇంజెక్షన్ కూడా వేయకూడదు. సర్జరీలు, ప్రసవాలు, అబార్షన్లు అసలే చేయకూడదు. ఎంబీబీఎస్ చదివిన వారు మాత్రమే అల్లోపతి వైద్యం చేయాలి. ఇతరులు వైద్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇకపై జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తాం. స్థానికంగా విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

సీమ ప్రాజెక్టులకు పూర్తిస్థాయి నీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): రాయలసీమ ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులు నేటికి పూర్తి కాకపోవడం, పంట కాల్వలు లేకపోవడంతో ప్రాజెక్టుల కింద ఉన్న లక్షలాది ఎకరాలకు నేటికి సాగునీరు అందలేదన్నారు. వాస్తవ పరిస్థితి ప్రపంచానికి తెలియజేసేందుకు ఆలోచన పరుల వేదిక నాయకులు విశ్రాంత ఐపీఎస్ అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలో రైతు సేవా సంస్థ అధ్యక్షుడు భవానీప్రసాద్ సాగునీటి రంగ విశ్లేషకులు లక్ష్మీనారాయణ, సామాజిక వేత్త రామారావు రాకపై ఆదివారం స్థానిక కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులకు సాధారణం కంటే నెల రోజుల ముందే వరదలు వచ్చినా సీమ ప్రాజెక్టులకు ప్రభుత్వం నీటిని విడుదల చేయలేదన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని దిగువకు విడుదల చేయడం అన్యాయమన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా గాలేరునగరి, ఎస్సార్బీసీ, తెలుగుగంగ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాలన్నారు. ప్రకృతి కనికరించి కృష్ణా, తుంగభద్ర జలాలు సీమ ముగింట చేరినా నీటిని పొందలేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటలతో కాలం వెళ్లదీస్తుందని, సీమ రైతులకు అవసరమైన నీటిని తక్షణమే అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వరనాయుడు, సుధాకర్‌కుమార్, అసదుల్లా, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

25 కిలోల బాక్స్ రూ. 1,300

ప్యాపిలి: గత కొద్ది రోజులుగా ప్యాపిలి మార్కెట్‌లో టమాట ధర ఆశాజనకంగా ఉంటోంది. ఆదివారం 25 కిలోల బాక్స్ రూ.1,300 పలికింది. దీంతో టమాట కిలో రూ.52కు చేరింది. ముందస్తు వానలకు సాగు చేసిన పంట చేతికి రావడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. సరుకు మంచి నాణ్యతతో ఉంటే వ్యాపారులు మంచి ధరకు కొంటున్నారు. నాణ్యత లేని సరుకు విషయంలో ధర భిన్నంగా ఉంటోంది.



ప్యాపిలి మార్కెట్‌లో టమాట వేలం వేస్తున్న వ్యాపారులు

కారుణ్య నియామకాలు



ఉద్యోగాలు పొందిన వారితో జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలో నలుగురికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలను కల్పించి వివిధ కార్యాలయాలకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. జెడ్పీలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు కారుణ్య నియామకాల కింద మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించామన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. జెడ్పీ యాజమాన్య పరిధిలోని ఆయా కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న కార్యాలయ సహాయకుల పోస్టుల్లో వీరిని నియమించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో నీరజాబాయి (జెడ్పీహెచ్‌ఎస్, నొస్సం), పీ శేఖర్ (ఎంపీపీ, ఓర్వకల్), ఎస్ రమాదేవి (పీఆర్ పీఐయూ డివిజన్, నంద్యాల), విజయ కుమారి (జెడ్పీహెచ్‌ఎస్, గార్గేయపురం) ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

శ్రీశైలంప్రాజెక్ట్/ శ్రీశైలం టెంపుల్: రోగులకు వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, శ్రీశైలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆదివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంత మంది పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నారు? వైద్యులు అందుబాటులో ఉన్నారా.. లేదా? ఎంత మంది డాక్టర్లు, సిబ్బంది పని చేస్తున్నారా లేదా?.. అంటూ వైద్య సిబ్బందిని, పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలు మాత్రమే ప్రభుత్వాసుపత్రులకు వస్తుంటారని, వారిని దృష్టిలో ఉంచుకొని మానవత్వంతో వైద్యం అందించాలన్నారు. సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట డాక్టర్ లీలా వినయ్‌రెడ్డి, డాక్టర్ యజ్ఞప్రసాద్, హెడ్ నర్స్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.




సున్నిపెంట ఆసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

బోధనలో మెలకువలు అవసరం

కర్నూలు(సెంట్రల్): విద్యా బోధనలో ఉపాధ్యాయులు నిరంతరం మెలకువలు నేర్చుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ అదనపు రాష్ట్ర పథక సంచాలకులు డాక్టర్ ప్రసన్నకుమార్ సూచించారు. ఆదివారం రాఘవేంద్ర బీఈడీ కాలేజీలో తొమ్మిది జిల్లాల కేజీబీవీ పీజీటీలకు ఇన్ సర్వీసు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతను ముఖ్యఅ అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పేద విద్యార్థినులు ఉంటుండడంతో వారి వ్యక్తిగత పరిస్థితులను తెలుసుకోని బోధన చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఆరుగురు రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్‌పాల్, జీసీడీఓలు సువర్చల, స్నేహలత పాల్గొన్నారు.

భక్తుల జేబుకు చిల్లు

- శ్రీగిరిలో అధికరేట్లకు ఆహార పదార్థాలు
- హోటళ్లు, దుకాణాలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ



శ్రీశైల ఆలయం




శ్రీశైలంలోని ఓ హోటల్

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చే భక్తులకు జేబులకు చిల్లులు పడుతున్నాయి. క్షేత్రంలో ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దేవస్థాన అధికారులు, సివిల్ సప్లై అధికారులు ధరల నియంత్రణలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు అధిక ధరల పోటు తప్పడం లేదు. శ్రీగిరి క్షేత్రంలో చిన్న, పెద్దహోటళ్లు అన్ని కలిపి 50 వరకు ఉంటాయి. క్షేత్రంలో ప్రైవేట్ హోటళ్లలో టిఫిన్, భోజనం చేద్దామంటే భక్తుల జేబుకు చిల్లులు పడే ధరలు దర్శనమిస్తున్నాయి. భక్తుల అవసరాలను అసరాగా చేసుకుని స్థానిక ప్రైవేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు లేకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నా అడిగేవారు లేరు. శివరాత్రి, ఉగాది ఉత్సవాల సమయంలో మాత్రమే సివిల్ సప్లై అధికారులు ధరలను ఫిక్స్ చేసి ధరల పట్టిక ఏర్పాటు చేస్తారు తప్పా..మిగతా రోజుల్లో అంతా వ్యాపారుల చేతుల్లోనే ధరలు ఉంటాయి. హోటల్‌లో ఆహార పదార్థాలలో నాణ్యమైన పదార్థాలు వినియోగిస్తున్నారా? లేదా? అని తనిఖీలు చేసే అధికారులు కరువయ్యారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు జిల్లా కేంద్రంలో ఉండడం, జిల్లా కేంద్రానికి శ్రీశైలం సుదూర ప్రాంతం కావడంతో ఇక్కడికి వచ్చి ఆహార పదార్థాల శాంపిల్స్ తనిఖీ చేసే అధికారులు కరువయ్యారు. తక్కువ ధరకు వచ్చే వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహార పదార్థాల తయారీలో శుచీ, శుభ్రతను సైతం పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన దేవస్థానం, సివిల్ సప్లై అధికారులు స్పందించి శ్రీశైల మహాక్షేత్రంలో ఆహర పదార్థాలను అధిక ధరలకు విక్రయించకుండా, సామాన్య భక్తులకు సైతం అందుబాటులో ఉండేవిధంగా ధరలను నిర్ణయించి, ధరల పట్టికను హోటల్ నిర్వాహకులు ప్రదర్శించేలా ఏర్పాటు చేసి భక్తుల జేబులకు చిల్లులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ఈ నెలా.. ఎగనామమే!

- బదిలీ టీచర్లకు రెండు నెలలుగా జీతాలు లేవు
- ఇప్పటికీ కేటాయించని పొజిషన్ ఐడీలు
- జిల్లాలో దాదాపు 600 మంది ఉపాధ్యాయుల ఆందోళన



నంద్యాల(న్యూటౌన్): అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పరిపాలనలో చేతులెత్తేస్తోంది. బదిలీ ఉపాధ్యాయులకు ఈ నెలా మొండిచేయి చూపింది. టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తి చేసిన ప్రభుత్వం బదిలీలు అయిన ఉపాధ్యాయులకు మాత్రం జీతాల చెల్లింపులో పూర్తిగా విఫలమైంది. దీనిపై ఉపాధ్యాయులు ఆందోళనలు, నిరసనలు చేపట్టినా సర్కారులో చలనం లేదు. ఈనెల 1వ తేదీన జీతాలు వస్తాయని ఎదురుచూసిన ఉపాధ్యాయులకు భంగపాటు మిగిలింది. సాధారణంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సమాచారం అందించాలి. దీని నిమిత్తం పొజిషన్ ఐడీలు కేటాయించాలి. గత నెల 15వ తేదీ లోపు అన్ని కేడర్ల ఉపాధ్యాయుల బదిలీలను పూర్తి చేశారు. నంద్యాల జిల్లాలో దాదాపు 600 మందికి పైగా స్థానచలనం కలిగింది. బదిలీలు పూర్తి చేసి నెల రోజులు దాటుతున్నా క్లియర్ వేకెన్సీల్లోకి బదిలీ అయిన వారికి మాత్రమే పొజిషన్ ఐడీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొత్తగా సృష్టించిన పీఎస్ హెచ్‌ఎం, రీపోర్షన్‌మెంట్ కొత్తగా ఏర్పడిన పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు మాత్రం ఇప్పటికీ పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. దీంతో జూన్, జూలై నెలలకు సంబంధించి ఆగస్టు నెలలో రావాల్సిన జీతాలు ఉపాధ్యాయులకు అందలేదు.

వచ్చే నెలా అనుమానమే..

ఉపాధ్యాయులను బదిలీ చేసిన తర్వాత కేడర్ స్ట్రెంగు నిర్ధారించి ఆ వివరాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ అండ్ ఆడిట్‌కు అందించాలి. అయితే పాఠశాల విద్యాశాఖ ఇప్పటికీ ఆ పని చేయలేదు. కేడర్ స్ట్రెంగ్ అయిన తర్వాతే ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించే అవకాశం ఉంది. బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు ఏరియర్ బకాయిలతో ఈనెల 10వ తేదీలోపు ట్రెజరీకి బిల్లులు పెడితేనే ఈ నెలలో జీతాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈనెల 10లోపు ఈ ప్రక్రియ పూర్తికాకుంటే బదిలీ అయిన టీచర్లకు జూన్, జూలైతో పాటు ఆగస్టు నెలకు సంబంధించిన జీతాలు కూడా సెప్టెంబర్‌లో పడే అవకాశం ఉండదని ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వం విఫలం



బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఒక నెల జీతాలు చెల్లించలేదంటే సాంకేతిక లోపమో, పని ఒత్తిడో అని సరిపెట్టుకోవచ్చు. కానీ రెండు నెలల జీతాలు ఆపడం అంటే సీఎస్ఈ నిర్లక్ష్యంగానే భావించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా సకాలంలో బిల్లులు చేసి జీతాలు చెల్లించాలి. – నగరి శ్రీనివాసులు, 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల

ఉపాధ్యాయులపై కక్ష



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోంది. బోధనేతర పనులు అప్పగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. అనేక రకాల లక్ష్యాలు, యాప్ అప్‌లోడ్ వంటి పనులు అప్పగించడం వారిని అవమానించడానికే. జీతాల చెల్లింపులో అలసత్వంపై ఉపాధ్యాయ లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

– శివయ్య, ఫ్యాప్టో చైర్మన్, నంద్యాల

క్లుప్తంగా

అదుపు తప్పి కారు బోల్తా



కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె సమీపంలో ఆదివారం రోడ్డు పక్కన కారు అదుపు తప్పి బోల్తా పడింది. పెట్నికోట వైపు నుంచి తాడిపత్రికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో గొర్విమానుపల్లె దాటాక లొక్కిగుండం సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాద సమయంలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మాత్రమే ఉండటంతో సురక్షితంగా బయటపడ్డారు. కారులో ఇరుక్కుపోయిన ఆ వ్యక్తిని స్థానికులు అద్దాల పగులగొట్టి బయటకు తీశారు.

ఆళ్లగడ్డలో చోరీ

ఆళ్లగడ్డ: పట్టణంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొరుగుల బట్టి వీధికి చెందిన సంజీవరాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి పట్టణంలోని ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లారు. రాత్రి 9.30 గంటల సమయంలో ప్రార్థన ముగించుకుని ఇంటికి వచ్చేసరికి దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. సంజీవరాయుడు కుమార్తెకు ఇటీవల వివాహం నిశ్చయం కాగా.. అందుకు సంబంధించి బంగారు, నగదు సిద్ధం చేసుకున్నాడు. ఇంతలో చోరీ జరగడంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ యుగంధర్ తెలిపారు.

ఏపీహెచ్ఎంఏ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం (ఏపీహెచ్ఎంఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీహెచ్ఎంఏ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో 2025–27 కాల వ్యవధికి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వై. నారాయణ, డీసీ హుస్సేన్, ట్రెజరర్‌గా రమేష్‌నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు జి.ఒంకార్ యాదవ్ పాల్గొన్నారు.

స్నేహితుల ఆపన్న హస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: స్నేహితుల దినోత్స వం స్నేహభావం పరిమళించింది. స్నేహితుడు మృత్యువాత పడగా తోటి మిత్రులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. మంత్రాలయానికి చెందిన డి.భీమేష్ అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న 2003 కు చెందిన 10 తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.60 వేలు స్నేహితుడి కూతురు దీక్షిత పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.బాండ్‌ను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి భార్య రాధ భర్త స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్దికెరలో..

మద్దికెర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమతో పాటు చదువుకొని కొందరు మిత్రులు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు రూ.72 వేలు అందజేశారు. మాజీ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొలంలో అక్రమ తవ్వకాలు



చిప్పగిరి: రైతులను సంప్రదించకుండా, కనీస సమాచారం ఇవ్వకుండా గాలి మరల కంపెనీ తమకు ఇష్టం వచ్చినట్లు అక్రమంగా తవ్వకాలు జరుపుతోంది. చిప్పగిరి మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన తలారి నెట్టికల్లుకు 0.99 ఎకరాల పొలం ఉండగా అందులో పెద్దకాలువ తవ్వి వదిలేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా ఫలితం రాలేదని, జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళతానని రైతు తెలిపారు.



అరకొర వర్షాలకు బేతంచెర్ల సమీప పొలాల్లో విత్తులు వేస్తున్న రైతులు (ఇన్‌సెట్) ఉలిందకొండ సమీపం వద్ద పొలంలో సేద్యం చేస్తున్న రైతులు

కష్టాల సేద్యం



పర్ల గ్రామ సమీప పొలాల్లో అడవి పందుల రక్షణ కోసం కట్టెలు నాటి ప్లాస్టిక్ కవర్లు చుట్టిన దృశ్యం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తయ్యింది. తొలుత వర్షాలు పడినా తర్వాత మొండికేశాయి. పొలాన్ని బీడుగా వదిలేయక చాలా మంది రైతులు విత్తనాలు నాటుతున్నారు. ఇందుకోసం ఇంట్లో ఉండే చిన్నపిల్లలను, పాఠశాలకు వెళ్లే విద్యార్థులను సైతం తీసుకెళ్తున్నారు. అవ్వాతాతలు కూడా పొలం బాట పట్టి అంతర సేద్యం పనుల్లో సాయం అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో గతేడాది వ్యవసాయం కలసి రాలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు. ఈ ఏడాదైనా కలసి వస్తుందనుకుంటే వరుణుడు కరుణించడం లేదు. మట్టి మనుషులు కాడి పట్టుకుని కష్టాల సేద్యం చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు







రేమట సమీప పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు



కోడుమూరు సమీపంలోని పొలాల్లో మిరప నాట్లు నాటుతున్న విద్యార్థులు

మద్యం దుకాణం వద్ద వ్యక్తి మృతి



మృతిచెందిన ఆంజనేయులు

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మద్యం దుకాణం వద్ద మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం 6 గంటలకు చోటుచేసుకుంది. కోడుమూరుకు చెందిన ఆంజనేయులు (37)కు భార్యాపిల్లలు లేరు. తాపీ పనిచేస్తూ బతికేవాడు. మద్యానికి అలవాటు పడి ఆదివారం సాయంత్రం కోడుమూరు పట్టణంలోని వెంకటగిరి రోడ్డులో గల ఓ మద్యం దుకాణం వద్ద వచ్చాడు. అతిగా మద్యం తాగి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సమీప బంధువులు మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. కాగా.. మద్యం దుకాణం వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లో ఆంజనేయులు మద్యం తాగి మృతిచెందినట్లు సమాచారం. అయితే నిర్వాహకులు ఎక్కడ తమపైకి సమస్య వస్తుందోనని గ్రహించి ఆంజనేయులు మృతదేహాన్ని అనధికారిక పర్మిట్ రూమ్‌లో నుంచి తెచ్చి తమ దుకాణానికి కొద్ది దూరంలో పడేసి వెళ్లినట్లు తెలిసింది.

ఇళ్లపై కూలిన విద్యుత్ స్తంభాలు

- తెగిన విద్యుత్ లైన్లు



ఓ ఇంటిపై ఒరిగిన విద్యుత్ స్తంభం

ఆదోని అర్బన్: రాయచోటి నుంచి నెల్లూరుకు ఆదోని మీదుగా వెళ్తున్న కంటైనర్ లారీ ఎల్‌బీ లైన్‌ను ఢీకొట్టింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు ఇళ్లపైన కూలాయి. విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో కాలనీవాసులు, ఆ రోడ్డున వెళ్లే పాదచారులు, వాహనదారులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం మరమ్మతులు చేపట్టారు. కాలనీలో ఒకచోట విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ఇంటిపై పడింది. మరో రెండు స్తంభాలు ఒరిగి విద్యుత్ లైన్లన్నీ కిందకు పడిపోయాయి. ఒక్కసారిగా విద్యుత్ స్తంభాలు ఒరగడంతో పెద్ద శబ్దం రావడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎంఎం కాలనీకి విద్యుత్ అధికారులు ఎల్‌బీ లైన్ ఏర్పాటు చేసేటప్పుడు రోడ్డు ఉందని తెలిసినా కూడా ఎత్తులో పోల్ వేయలేకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ప్రధాన రహదారుల్లో పెద్ద పెద్ద వాహనాలు వెళ్తుంటాయని, అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నంద్యాల డయాసిస్ బిషప్‌గా రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావు



బిషప్‌గా ఎన్నికైన సంతోష్‌ను అభినందిస్తున్న చర్చి ఫాదర్లు

నంద్యాల(న్యూటౌన్)/కర్నూలు (టౌన్): చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా నంద్యాల అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్)గా రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావును నియమించినట్లు నంద్యాల డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియమ్స్ ఆదివారం పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ 11వ తేదీన నంద్యాలలో జరిగిన బిషప్ ఎన్నికల్లో నలుగురు బిషప్ అభ్యర్థులుగా విజయం సాధించారు. వీరిలో రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావును చెన్నైలోని మోడరేటర్ కార్యాలయంలో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్ రూబెన్ మార్క్ అధ్యక్షతన ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. దాదాపు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బిషప్ ఎంపిక ప్రక్రియ నేటితో ముగిసింది. దీంతో నంద్యాల డయాసిస్ పరిధిలోని సంఘాల పాస్టరేట్ చైర్మన్లు, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1, 2, 3, 4, 5, 6 గురువులు హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల అధ్యక్ష ఖండం పీఠాధిపతులుగా నియమితులు కావడంతో పరిపాలన సౌలభ్యం ముందుకు సాగుతుందన్నారు. హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి డీనరీ చైర్మన్ కొత్త మాసి జోసెఫ్, ఇమ్మానియేల్, నందం ఐజక్, విజయ్‌కుమార్, సంజీవ్‌కుమార్, పాస్టరేట్-1 సెక్రటరీ ప్రభుదాసుతో పాటు కమిటీ సభ్యులు, పాస్టరేట్-2 బాలయ్య, కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులతో పాటు ఆయా సంఘాల కాపర్లు, కమిటీ పెద్దలు, క్రైస్తవులు నంద్యాల అధ్యక్ష ఖండం బిషప్ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

5న పట్టాభిషేకం

గత బిషప్‌గా ఉన్న పుష్పాలలిత పదవీ విరమణ చెందడంతో నూతన బిషప్‌గా రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావును ఎంపిక చేశారు. ఈయన వైఎస్సార్ జిల్లా ముద్దనూరులో పాస్ట్రేట్‌లో డినరీ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలులోని చిల్డ్రన్స్ పార్కు సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావును అభినందించారు. ఈనెల 5వ తేదీ నంద్యాల కేథడ్రల్ చర్చిలో సంతోష్‌కు బిషప్ పట్టాభిషేకం జరుగుతుందని చర్చి నిర్వాహకులు తెలిపారు.

మిక్సీలు, స్టవ్‌లు రిపేర్ చేస్తానంటూ చోరీలు

- దొంగను అరెస్టు చేసిన పోలీసులు
- బంగారు, వెండి నగలు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

ప్యాపిలి: మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు రిపేరు చేస్తానని సైకిల్‌పై గ్రామాల్లో తిరుగుతూ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు అపహరించేవాడు. వాటిని విక్రయించి సొమ్ము చేసుకుని గోవా తదితర ప్రాంతాల్లో జల్సాలు చేసేవాడు. ఈ దొంగను, అతనికి సహకరించిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ప్యాపిలి సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరామిరెడ్డి, జలదుర్గం ఎస్ఐ నాగార్జున ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా యాడికి పట్టణానికి చెందిన జోగి రాజ అలియాస్ రాజ కుళ్లాయప్ప, గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన మునగాల సుంకన్నను బావిపల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి ఐదు తులాల బంగారు నగలు, 10 తులాల వెండి కాళ్ల పట్టీలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపామనానరు. జోగి రాజు.. హుసేనాపురం గ్రామంలో రెండు ఇళ్లలో, మామిళ్లపల్లి గ్రామంలోని ఒక ఇంటిలో గత రెండు, మూడు నెలల క్రితం చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అపహరించిన సొమ్ములో కొంత సొమ్మును విక్రయించడానికి మునగాల సుంకన్నకు ఇచ్చినట్లు వెల్లడించారు. జోగి రాజు మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు రిపేరు చేస్తానని సైకిల్‌పై తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. అపహరించిన నగలను విక్రయించి వచ్చిన సొమ్ముతో గోవా తదితర ప్రాంతాల్లో జల్సాలు చేసేవాడని తెలిపారు. గతంలో జోగి రాజుపై తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులు నమోదైనట్లు తెలిపారు. కేసు ఛేదించిన ఎస్ఐ నాగార్జున, హెడ్ కానిస్టేబుల్ నీలకంఠ, పీసీలు మాధవరెడ్డి, వెంకటరాజు, మాదన్న, నరసయ్య, మద్దిలేటి, అశోక్‌కుమార్, హోంగార్డులు హుసేన్‌బాష, మహబూబ్ బాషాలను సీఐ అభినందించారు.

మొరాయించిన ఆర్‌యూ వెబ్‌సైట్

- సమస్యను పరిష్కరించిన అధికారులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ www.ruk.ac.in కొన్ని రోజులుగా మొరాయిస్తూ వస్తోంది. గూగుల్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడటంతో సమస్య ఆదివారం రాత్రికి పరిష్కారం అయ్యింది. వర్సిటీ వెబ్‌సైట్‌ను రెన్యూవల్ చేయకపోవడంతోనే సమస్య వచ్చింది, వర్సిటీల చరిత్రలో ఇలాంటి ఘటన ఆర్‌యూలోనే మొదటిసారి జరిగిందని కొందరు చెబుతున్నారు. పీజీ సెట్, ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్, వివిధ కోర్సుల ఫలితాల విడుదల, బీఈడీ అఫ్లియేషన్ కమిటీల రిపోర్ట్ అప్‌లోడ్ చేయడం, డిగ్రీ అడ్మిషన్లు, వర్సిటీలో కొత్త కోర్సు అడ్మిషన్ ప్రారంభం లాంటివి జరుతున్న నేపథ్యంలో వర్సిటీ వెబ్‌సైట్ మొరాయించడం చర్చనీయాంశమయ్యింది. వర్సిటీ అధికారుల తీరుపై విద్యావేత్తలు, ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు వర్సిటీ వెబ్‌సైట్‌పై విద్యా శాఖ మంత్రి దృష్టికి మెయిల్ ద్వారా తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ్ కుమార్ నాయుడును సంప్రదించగా వెబ్‌సైట్ రెన్యువల్‌కు సంబంధించి రెండు రోజుల క్రితం రిజిస్ట్రార్ మెయిల్‌కు సమాచారం వచ్చిందని, డబ్బు చెల్లించామని, సమస్య పరిష్కారం అయ్యిందని చెప్పారు.

పోలీసుల అదుపులో జనని బ్యాంకు సూత్రధారి?

కోవెలకుంట్ల: ఎక్కువ వడ్డీ ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసి బోర్డు తిప్పేసిన జననీ బ్యాంకు కేసులో ప్రధాన నిందితుడు వెంకటరమణను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్లకు చెందిన గువ్వల పద్మావతి మరికొంత మందితో కలిసి నాలుగేళ్ల క్రితం పట్టణంలోని ఓంశాంతి భవన సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మిగతా ప్రైవేట్ బ్యాంకుల కంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని, డిపాజిట్లపై రుణాలు తీసుకోవచ్చని నమ్మబలికించారు. వీరి మాటలు నమ్మి కోవెలకుంట్లతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఖాతాదారులుగా చేరి దాదాపు రూ. 2 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ఖాతాదారులు జమ చేసిన సొమ్మును సంస్థ సీఈఓ వెంకటరమణ తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకుని స్వాహా చేశాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాదారుల బాండ్లకు గడువు తీరిపోవడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు సొసైటీ వద్దకు వెళ్లగా సంస్థ యాజమన్యం బోర్డు తిప్పేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసులో ఇప్పటికే గువ్వల పద్మావతి, ఆకుల భరద్వాజ్, బ్యాంకు అధ్యక్షురాలు సుజాతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొదటి నిందితుడిగా ఉన్న వెంకటరమణను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

హాస్టళ్లలో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



కర్నూలు బీసీ వసతి గృహ సంక్షేమ అధికారులతో మాట్లాడుతున్న డీబీసీడబ్ల్యూ ఈఓ ప్రసూన

కర్నూలు (అర్బన్): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బీసీ సంక్షేమం సాధికారత అధికారిణి కె ప్రసూన ఆదేశించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో మెగా పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతి గృహ సంక్షేమ అధికారులు హాస్టళ్ల పరిసరాలు, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా, తాగునీరు కలుషితమైనా విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్‌డబ్ల్యూఓలందరూ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. తరచూ హాస్టళ్లను పరిశీలిస్తుంటామని, ఎక్కడైనా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటే సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఒకరినొకరు పట్టుకుని వంతెనపై వస్తున్న కూలీలు, రైతులు

వాగనక.. వరదనక !

రేయనక, పగలనక.. ఎండనక, వాననకా.. వాగనక వరదనక.. రాయనక రప్పనక.. దుమ్మనక దుప్పనకా..ముళ్లనక ముప్పనక.. పురుగనక పామనక.. కోడికూత కోయగానే నాగలెత్తి పొలం చేరి.. విత్తు నాటి.. పైరు పెంచి.. ఇలా ఓ సినిమాలో హీరో రైతు కష్టాన్ని వివరిస్తాడు. నిజమే రైతులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పంటలు సాగు చేస్తారు. ఇందుకు ఈ చిత్రమే నిదర్శనం. గత మూడువారాలుగా కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన చాలా మంది రైతులు కుందూనది ఒడ్డున వరిపంట సాగుచేస్తారు. ప్రస్తుతం వరి నాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం కుందూనదిపై ఉన్న వంతెనపై నీరు ప్రవహిస్తుంది. దీంతో కూలీలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఒకరి నొకరు చేతులు పట్టుకుని ప్రమాదకర పయనం చేస్తూ ఒడ్డుకు చేరుతున్నారు. ఏమాత్రం అదుపు తప్పినా కుందూలో గల్లంతు కావాల్సిందే. ప్రమాదకర పరిస్థితుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు పనులు చేసుకుంటున్నారు.

– దొర్నిపాడు



ఒడ్డుకు చేరిన దృశ్యం

పాముకాటుతో మృతి

బండి ఆత్మకూరు: ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎల్లమ్మ (60) అనే వృద్ధురాలు పాము కాటుతో మృతి చెందింది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. ఎల్లమ్మ, తన కుమారుడు వెంకట స్వామి ఇద్దరు కలిసి గురువారం పొలం పనులకు వెళ్లారు. అక్కడ ఎల్లమ్మ పాము కాటుకు గురి కాగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

శాస్త్రోక్తంగా పల్లకోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని జరిపారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపారు.